# ఎవరికి వారే....

ఆ ఇంట్లో ఉండేది నలుగురే. తల్లి, తండ్రి. కొడుకు, కూతురు- అయితే నలుగురివీ నాలుగు రకాలైన దృక్పథాలు. మరి అదేం సంసారమో- ఏ ఒక్క రోజూ నలుగురూ కలిసి ఒక చోటికి వెళ్ళరు. మాట్లాడుకోరు. యాంత్రికంగా ఎవరి పని వారు చేసుకుపోతుంటారు. అంతే. రేడియో అయినా పలుకుతుందా అంటే, అది ఈ మధ్య పాడైపోయి రెస్టు తీసుకుంటోంది టేబుల్ మీద.

"ఏమండీ! మాట్లాడకపోతే పోయేగాని ఆ రేడియోఅన్నా రిపేరు చేయించరు కదా" అంది ఇంటావిడ. ఇంటాయన ఉలకడు, పలకడు.

"ఒరేయ్ రవీ! కాస్త రేడియో రిపేరు చేయించుకు రారా" అంది కొడుకుతో. అతనూ తండ్రిని మించిపోయాడు. ఆడపిల్ల జయ సరే సరి. ఆమెకు ఏ పని చెప్పినా ఇంటాయన కోపంగా ఉరిమి చూస్తాడు భార్యని.

"ఏమిటో ఈ ఇల్లు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుంది" అని గొణిగింది ఇల్లాలు భోజనాలు వడ్డిస్తూ.

సాయంత్రం అవుతోంది. ముందు గదిలో రవి ఏదో చదువుకుంటున్నాడు. "నేను బయటికి వెళుతున్నానన్నట్లు కొడుకువైపు ఓ చూపు చూసి ఆ తండ్రి బయటికి వెళ్ళిపోయాడు. జయ డ్యాన్స్‌క్లాస్‌కి

వెళ్ళింది. సాయంత్రం వచ్చే పేపరు తెచ్చుకుంటామని తల్లితో చెప్ప కుండానే" ఇప్పుడే వచ్చేస్తాను కదా అని రోడ్డుమీదికి వెళ్ళాడు రవి.

ఇంటి తలుపులు బార్లా తీసి ఉన్నాయి. ఇల్లు బాగా రోడ్డుమీదికి ఉందేమో ముందు గదిలో ఎవరున్నదీ లేనిదీ బాగా కనిపిస్తుంది. ఇంటా విడ వంటింట్లో పచ్చడి చేస్తున్న రోకలి శబ్దం వినిపిస్తోంది. ఇదే అద నుగా అంతా గమనిస్తున్న ఓ దారినపోయే దానయ్య ముందుగదిలో అందు బాటులో ఉన్న చిన్న రేడియోను చంకన పెట్టుకుని గుమ్మం దాటడం, అదే సమయానికి పేపరు కొనుక్కుని రవి లోపలికి రావడం, రేడియో తీసుకువెళుతున్న వ్యక్తిని చూసి "నాన్న రిపేరుకు పంపిస్తున్నాడేమోలే" అని సమాధానపడి లోపలికి వచ్చేయడం-క్షణంలో జరిగిపోయాయి.

"రేడియో రిపేరింగ్ షాప్ తెరిచి ఉంటే ఇది రిపేరుకి పంపిద్దా మనుకున్నా- ఈమధ్య ఎన్నిసార్లు చూసినా ఇక్కడి షాపు తెరిచే ఉండ ట్లేదు" అంటూ తండ్రి విసుక్కుంటూ లోపలికి వచ్చి, "ఏరా రవీ, రేడియో ఏదీ?" అన్నాడు.

"అదేమిటి- రిపేరు కోసం మనిషిని నువ్వు పంపించలేదా?" అంటూనే విషయం అర్థమైపోయి చేతిలో పేపరు కింద పడేసి చుట్టుపక్కల నాలుగు వీధులూ గాలించి, ఫలితం లేక డీలా పడిపోయి ఇల్లు చేరాడు.

"అసలేం జరిగిందిరా?" అంది తల్లి ఆత్రంగా తన పెళ్ళికి ప్రెజెం టేషన్‌గా వచ్చిన రేడియోను తలుచుకుంటూ.

"సారీ, మమ్మీ! నా పక్కనుంచే ఆ దొంగవెధవ రేడియో పట్టుకెళ్తే నాన్న రిపేరుకు పంపిస్తున్నారనుకుని చేజేతులా వాణ్ణి వదిలేశాను.." అన్నాడు రవి బాధగా.

ఇంట్లో ఉన్న నలుగురూ నాలుగు దార్లైతే పరిస్థితి మరో రకంగా ఎట్లా ఉంటుంది? తిరిగిరాని రేడియో గురించి బాధపడుతూ, నిటూరుస్తూ లోపలికి నడిచారంతా.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 26-11-86)